
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 225 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 11-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :225 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 11-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## 13న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తరువాయి 2లో..

## ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ

- బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు
- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి



అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్‌ను ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్ధంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్’ ఏర్పాటు, పెట్టుబడుల తరువాయి 2లో..

## ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

### లోక్‌సభలో ప్రియాంక గాంధీ

లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ

నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక

స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ తరువాయి 2లో..

## యుద్ధం నుంచి వైదొలుగుదాం

ట్రంప్‌నకు సహాయకుల విజ్ఞప్తి..?



తరువాయి 2లో..




న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

చమురు శుద్ధి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకుల చట్టాన్ని పయోగించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత సృష్టించకుండా ఈ నిర్ణయం తీసుకుంది. వీటి సరఫరాకు అంతరాయం కలగకుండా, పంపిణీ సమానంగా జరిగేలా తాజాగా పెట్రోలియం శాఖ ఈ చర్యలు చేపట్టింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. దేశంలో చమురు, గ్యాస్ సరఫరాకు ఆటంకం కలగకుండా కేంద్రం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. దేశీయ సరఫరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇక, వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. మరోవైపు.. దేశంలో తరువాయి 2లో..

## గ్యాస్ కొరత.. ఆందోళనలో తెలుగు రాష్ట్రాల హోటల్ పరిశ్రమ



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్

వంటగ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా చిన్న హోటళ్లు మూతపడుతున్నాయి. హోటళ్లకు కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని డీలర్లకు పెట్రోలియం కంపెనీలు ఆదేశించిన నేపథ్యంలో యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నగరాలైన ముంబయి, ఢిల్లీ బెంగళూరులో పలు హోటళ్లను తాత్కాలికంగా మూసివేశారు. ఈ ప్రభావం తెలుగు రాష్ట్రాలపైనా తీవ్రంగా ఉంటుందని హోటల్ యజమానులు చెబుతున్నారు. విశాఖలో కమర్షియల్ సిలిండర్ల కొరత ఉందని విశాఖ హోటల్ మర్చంట్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. సిలిండర్ల సరఫరా రేపటి నుంచి మరింత తగ్గవచ్చని అన్నారు. విశాఖలో ఇప్పటికే బ్లాక్ మార్కెట్ నడుస్తోందని, పరిస్థితి ఇలాగే ఉంటే నిర్వహణ కష్టంగా మరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కమర్షియల్ సిలిండర్ల కొరతపై ఇప్పటికే కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చామని హోటల్ యజమానులు తరువాయి 2లో..

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు..

పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు

ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన వేడుకల రద్దు

ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కీలక నిర్ణయం

జిల్లా, నగర, మండల కేంద్రాల్లో స్థానికంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలన్న పవన్

పిఠాపురం, సిటిజన్ టైమ్స్

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ప్రణాళికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 14న పిఠాపురంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించాలని జనసేన తొలుత నిర్ణయించింది. అయితే, ఆ వేడుకలను రద్దు చేస్తున్నట్లు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితులపై అందిన నివేదికలను దృష్టిలో ఉంచుకుని జనసైనికుల క్షేమం కోసమే ఈ నిర్ణయం తరువాయి 2లో..



## స్పీకర్‌పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం..

లోక్‌సభలో మొదలైన చర్చ



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఇందుకోసం 10 గంటల తరువాయి 2లో..

## అందుకే ఢిల్లీ కాలుష్యాన్ని, బెంగళూరు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నాయి

పాలకులకు దూరదృష్టి లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్న సీఎం

కొత్త సవాళ్లు ఎదుర్కోవాలంటే పోలీసు అధికారులు అప్ గ్రేడ్ కావాలన్న ముఖ్యమంత్రి

సమస్యను బాగా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్లే అన్న సీఎం

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశ రాజధాని ఢిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోందని, బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోందని, ముంబై, చెన్నై నగరాలు వరద సమస్యలను చూస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు దూరదృష్టి లేకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని అన్నారు. పోలీసు అధికారుల రీట్రీట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# గంటాకు ఉందిలే మంచి కాలం !

విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఉగాది తరువాత అన్నీ మంచి రోజులేనా అన్న చర్చ సాగుతోంది. ఆ మాటకు వస్తే ఇపుడు ఉన్నవి మంచి రోజులు కాదా అంటే ఆయనకు ఎపుడూ కీలక స్థానమే పార్టీలో ప్రజలలో ఉంది. భీమునిపట్నం నుంచి 2024 ఎన్నికల్లో 90 వేలకు పైగా భారీ మెజారిటీని సాధించిన గంటాకు ఈసారి కూటమి మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. చూస్తూండగానే రెండేళ్ళు గడచిపోతున్నాయి. దాంతో గంటాకు ఈ టెర్మ్ మంత్రి పదవి ఉందా లేదా అన్న చర్చ ఆయన అనుచరులు అభిమానులలో పెద్ద ఎత్తున ఉంది. విశాఖ జిల్లాలో ఇపుడు అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ పెద్ద ఎత్తున జరుగుతున్నవి గంటా నియోజకవర్గం భీమిలీలోనే. ఐటీ పరిశ్రమలు వచ్చినా గూగుల్ డేటా సెంటర్ వచ్చినా, ఎయిర్ ఫీల్డ్ ఎడ్యుకేషన్ సిటీ వచ్చినా అనేక ఇతర పరిశ్రమలు వచ్చినా అన్నీ భీమిలీ పరిధిలోనే చోటు చేసుకుంటున్నాయి. దాంతో గంటా కూడా జోరు చేస్తున్నారు. ఆయన గతానికి భిన్నంగా ఈ పరిశ్రమల ఏర్పాటు కోసం అవసరమైన భూముల సేకరణ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అటు భూసేకరణకు అవరోధాలు లేకుండా అందరినీ మెప్పించి ఒప్పించి ఈ ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా చూస్తున్నారు. దాంతో చంద్రబాబు దృష్టిలో గంటాకు మంచి మార్కులు పడ్డాయని అంటున్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గంటా తన నియోజకవర్గం సమస్యల మీద ప్రస్తావించి హైలెట్ అయ్యారు. అంతే కాదు ఆయన చినబాబు లోకేష్ తో కూడా కలసి మెలసి ముందుకు సాగుతున్నారు. ఏపీలో టాప్ త్రీ భారీ మెజారిటీ ర్యాంకర్లు అంటూ పల్లా శ్రీనివాస్ గంటాలతో కలసి లోకేష్ ఫోటోలు దిగడం కూడా గంటా పట్ల హైకమాండ్ కి ఉన్న పాజిటివ్ రెస్పాన్స్ అర్థం అవుతోంది అని అంటున్నారు. తన నియోజకవర్గంలో కూడా ప్రతీ రోజూ గంటా పెద్ద ఎత్తున పర్యటిస్తున్నారు. ప్రజలతో ఎక్కడికక్కడ మమేకం అవుతున్నారు. నియోజకవర్గాన్ని ఆయన కంచుకోటగా మారుస్తున్నారు. ఇక గంటాకు మంత్రి పదవి దక్కుతుంది అని ప్రచారంలో ఉంది. గంటా బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఏపీలో వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉంది అన్నది తెలిసిందే. దాంతో పాటుగా ఆయన రాజకీయంగా కూడా చురుకైన వారు. విశాఖ జిల్లా వరకూ వస్తే మంత్రి పదవి అయితే ఖాళీగా ఉంది. దాంతో విస్తరణలో గంటాకు చాన్స్ దక్కవచ్చు అని అంటున్నారు. విశాఖ జిల్లా కూటమికి చాలా కీలకమైనదిగా ఉంది. ఈ నేపథ్యంలో అనుభవం కలిగిన వారు కనుక మంత్రిగా ఉంటే విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్రా రాజకీయం కూడా కూటమికి ప్రత్యేకించి తెలుగుదేశానికి అనుకూలిస్తుంది అని అంటున్నారు. వైసీపీని కూడా బలపడకుండా నియంత్రించేందుకు గంటా వంటి అనుభవం కలిగిన వారు కలసి వస్తారు అని అంటున్నారు. ఇక సెంటిమెంట్ పరంగా చూస్తే కనుక గంటా ఇవే తనకు చివరి ఎన్నికలు అని అంటున్నారు. దాంతో గౌరవప్రదంగా మంత్రి హోదాలో పదవీ విరమణ చేయాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. మరి ఈ సెంటిమెంట్ కూడా వర్కౌట్ అయ్యే అవకాశాలు ఉన్నాయ్ని అంటున్నారు. దాంతో దాంతో గంటాకు మంత్రి పదవి ఖాయం అయింది అని అంటున్నారు.

#### అందుకే ఢిల్లీ కాలుష్యాన్ని, బెంగళూరు ట్రాఫిక్

## సమస్యను ఎదుర్కొంటున్నాయి

సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారానే పోలీసు శాఖకు గౌరవం పెరుగుతుందని అన్నారు. కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయని, ఇవి పోలీసులకు సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. భౌతికంగా కనిపించని నేరాలను కనిపెట్టడం సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. కొత్త సవాళ్లు ఎదుర్కోవాలంటే పోలీసు అధికారులు అప్ గ్రేడ్ కావాలని అన్నారు. సమస్యను బాగా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్లేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు బాగుండాలని అన్నారు. శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాలకే పెట్టుబడులు బాగా వస్తున్నాయని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతం కాగా, జీడీపీలో మాత్రం 5 శాతం అందిస్తోందని అన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేరాలనేది తమ ఆశయమని అన్నారు.

# యుద్ధం వేళ.. చమురు సంస్థలపై కేంద్రం నిత్యావసర సరకుల చట్టం

పెట్రో ధరలు ఇప్పటికిప్పుడు పెరగబోవని, చమురు కంపెనీల వద్ద సరిపడా నిల్వలున్నాయని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వచ్చే 6 నుంచి 8 వారాల వరకూ సరిపడినంతగా ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రో నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరత సృష్టించకుండా తాజాగా నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది. పౌరులకు అందుబాటు ధరల్లో నిత్యావసర సరకులు లభించేలా చూడటం, కృత్రిమ కొరతను నిరోధించడం, బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1955లో నిత్యావసర సరకుల చట్టాన్ని తీసుకువచ్చింది. ఆహార భద్రతను కాపాడేందుకు, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ యాక్ట్‌లోని సెక్షన్-3 కింద నిత్యావసరాల ఉత్పత్తి, సరఫరా, పంపిణీని నియంత్రించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడే దిశగా నిల్వల పరిమితిపై ఆంక్షలు విధించగలదు. ధరలను నిర్ణయిస్తుంది. సెక్షన్-3 కింద తనకు లభించిన అధికారాలను కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులకు అప్పగించేందుకు చట్టంలోని సెక్షన్-5 అనుమతిస్తుంది. దాంతో క్షేత్రస్థాయిలో పంపిణీకి అంతరాయం కలగకుండా చూసేందుకు వీలు కలుగుతుంది.

# గ్యాస్ కొరత.. ఆందోళనలో తెలుగు రాష్ట్రాల హోటల్ పరిశ్రమ

చెబుతున్నారు. గ్యాస్ కొరత లేకుండా సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం**

కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిపివేయడంతో తమ వ్యాపారానికి గండిపడిందని తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయాలు చూపించకపోతే రాష్ట్రవ్యాప్తంగా హోటళ్ల బంద్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సికింద్రాబాద్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఎల్‌పీజీ గ్యాస్ దిగుమతులు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరతతో హోటల్ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. మరోవైపు పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఎదుర్కొంటున్నట్లు హైదరాబాద్ ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ తెలిపింది. ఈ నేపథ్యంలో పరిస్థితి మెరుగుపడే వరకు గ్యాస్ సిలిండర్ల వినియోగం విషయంలో ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ల యజమానులు ఆచితూచి వ్యవహరించాలని సూచించింది. అన్ని హాస్టళ్ల యజమానులు ప్రత్యామ్నాయ వంట పద్ధతులను అమలు చేయాలని చెప్పింది.

# ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ

ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం**

తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. “గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి” అని సూచించారు. ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది. వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు, రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు..

తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తొలుత పిఠాపురం వేదికగా రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని భావించినప్పటికీ, ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యూహం మార్చారు. రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బదులుగా, ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా, నగర, మండల కేంద్రాల్లో ఎక్కడికక్కడ స్థానికంగానే ఘనంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. మార్చి 14 అనేది జనసైనికులకు, వీర మహిళలకు ఒక పండగలాంటి రోజని, ఆ ఉత్సాహం తగ్గకుండా స్థానిక స్థాయిలోనే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. పిఠాపురంలో భారీ సభ రద్దు కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన కార్యాలయాలు పండుగ వాతావరణానికి సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గాల వారీగా పార్టీ జెండా ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలతో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## మొదటి పేజీ తరువాయి

# 13న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. ఈ దఫా మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారు.

# యుద్ధం నుంచి వైదొలుగుదాం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపడుతోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ యుద్ధం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు బహిరంగంగా ప్రకటించాలని.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆయన సలహాదారులు కోరుతున్నట్లు అందులో వెల్లడించింది. యూఎస్ అధికారిక వర్గాల నుంచి ఈ సమాచారం వచ్చినట్లు తెలిపింది. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ అణు వ్యవస్థలను నాశనం చేయాలన్న అమెరికా లక్ష్యం నెరవేరిందని.. ఆ దేశంపై యుద్ధంలో తాము అనుకున్న వాటికంటే ఎక్కువ లక్ష్యాలనే అమెరికా సైన్యం సాధించిందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు యుద్ధం నుంచి వైదొలిగినా ఎటువంటి నష్టం లేదని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, సుదీర్ఘ యుద్ధాల వల్ల సొంత ప్రజల నుంచే వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందువల్ల యుద్ధం నుంచి వైదొలిగితేనే మంచిదని ట్రంప్‌నకు సూచించారు. కాగా ఈ కథనాన్ని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తోసిపుచ్చారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో ట్రంప్‌నకు ఎవరూ ఎటువంటి సలహాలు ఇవ్వలేదని స్పష్టంచేశారు. ఈ విషయంపై వస్తున్న కథనాల్లో నిజం లేదన్నారు. ఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో విజయం సాధించడానికి ట్రంప్ పాలకవర్గంలోని అగ్ర సహాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనుకున్న లక్ష్యాలను సాధించేవరకు ట్రంప్ తన పోరాటాన్ని ఆపరని అన్నారు. ఒకవేళ యుద్ధాన్ని ముగించాలని నిర్ణయం తీసుకుంటే ఆ విషయాన్ని కమాండర్ ఇన్ చీఫ్ బహిరంగంగా ప్రకటిస్తారని అన్నారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. “ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు” అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, “గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు” అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. “ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం” అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# స్పీకర్‌పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం..

సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ తీర్మానంపై చర్చ వేళ సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరాయి. ఇందుకు అంగీకరించిన కేంద్రం.. సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. ఇందుకోసం 118 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు తెలుస్తోంది. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజార్టీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు 293 సంఖ్యాబలం ఉంది. ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలు ఉన్నారు. దీంతో విపక్షాలు ఈ తీర్మానం నెగ్గే అవకాశాలు దాదాపు కన్పించట్లేదు.

# విద్యా ప్రమాణాల పెంపునకు లోకేష్ కృషి

**ఎమ్మెల్యే ఆనందరావు -తూర్పులంకలో ఎంపీపీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు**





**అల్లవరం సిటిజన్ టైమ్స్ మార్చి 10**

మండలం లోని తూర్పులంక గ్రామంలో సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రజలకు అంకితం చేయడంతో పాటు, ఎంపీపీ పాఠశాల నూతన భవనాన్ని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా ప్రమాణాలను పెంచి, దేశంలోనే మన పాఠశాలలు, కళాశాలలను అగ్రస్థానంలో నిలిపేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలోని 63 లక్షల మంది విద్యార్థుల్లో సగానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని, వారందరికీ నాణ్యమైన యూనిఫామ్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, పేరెంట్-టీచర్ మీటింగ్స్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారని తెలిపారు. ఒకపక్క విద్యాశాఖను ప్రక్షాళన చేస్తూనే, మరోపక్క విదేశీ పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి కల్పించేలా లోకేష్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మంచినీటి సమస్య పరిష్కారంపై మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రతి ప్రాంతానికి రక్షిత మంచినీరు అందించే ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. మొదటి విడతలో గన్నవరం,రాజోలు నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నాయని, రెండో విడతలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలను చేర్చామని స్పష్టం చేశారు. రాబోయే 10 నెలల్లో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సంపూర్ణంగా మంచినీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.తూర్పులంక గ్రామంలో ఇప్పటికే 80 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని, గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 'అభివృద్ధి - సంక్షేమమే' ఆశయంగా పనిచేస్తున్న తనను ఆశీర్వదిస్తున్న నియోజకవర్గ ప్రజలకు, నిరంతర అభివృద్ధి పనుల ద్వారానే జవాబుదారీగా ఉంటానని ఎమ్మెల్యే ఆనందరావు పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ నూతన రాజోలు ఇన్చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే పాముల...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 10**

రాజోలు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నూతన ఇంచార్జిగా నియమితులైన పాముల రాజేశ్వరి దేవి అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకోన్నారు. రాజకీయాల్లో కొత్త బాధ్యతలు స్వీకరించినప్పుడు దైవ దర్శనం చేసుకోవడం ఒక సంప్రదాయం అని అన్నారు. నూతన ఇంచార్జిగా పాముల బాధ్యతలు చేపట్టిన శుభసందర్భంగా, ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికి, పండితులచే వేదాశిర్వాదం అందించారు. రాజేశ్వరి దేవితో పాటు నియోజకవర్గం లోని ముఖ్య నాయకులు, నియోజకవర్గ సరిహద్దుల నుండి అంతర్వేది వరకు కార్యకర్తలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపినారు. రాజోలు నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పట్టును బలపరిచే దిశగా, అందరినీ కలుపుకుని పోయే సంకేతాలు కనబడుతున్నాయి. వైసీపీ నాయకులకు కలుసు కొంటూ తిరిగారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైసీపీ ముఖ్య నాయకులు కే ఎస్ ఎన్ రాజు, చంటిరాజు, నల్లి డేవిడ్, జంపన బుజ్జీరాజు, ఘనస్వాగతం పలికారు.

# రోడ్డుకు మోక్షం కలిగించారు



**చింతలపూడి (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

ఏలూరు జిల్లా, చింతలపూడి నుంచి నరసాపురం వైపు వెళ్ళు రోడ్డు మార్గాన ప్రయాణం చేయాలంటే చాలా నరకముగా ఉండేది,లిమీరే మా దైవం అంటూ చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ను అభినందనలతో ముంచెత్తిన టీ నర్సాపురం వాసులు. ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారారు కానీ ఆ రోడ్డు వేయించలేకపోయారు. మీరు చెప్పిన గడువు ప్రకారంగా రోడ్డు వేయించి మాకు అందుబాటులోనికి తీసుకువచ్చారు. మీరే మా దైవం మీరు చేసిన మేలు మరువలేనిది అంటూ చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ కి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ప్రజలు.

# టిడ్కో రుణాలు వెంటనే మంజూరు చేయాలి....

**ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ....**



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చ్ 10**

ఉగాది పండుగ నాటికి టిడ్కో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి ఇళ్లను అందించేందుకు పెండింగ్‌లో ఉన్న బ్యాంకు రుణాలను వెంటనే మంజూరు చేయాలని బ్యాంకర్లను మెప్మా పీడీ టీ కనకరాజు కోరారు. పురపాలక శాఖ ఉత్తర్వులపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం టిడ్కో పెండింగ్ లోన్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా మెప్మా పీడీ టి. కనకరాజు హాజరై కమిషనర్ టీవీ రంగారావు, వివిధ బ్యాంకుల మేనేజర్లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ మెప్మా సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి బ్యాంకు లోన్లు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉగాది పండుగ నాటికి అంటే ఈ నెల 19 తేదీ వరకు టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మెప్మా పీడీ కనకరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరితగతిన మంజూరు చేసి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని బ్యాంకు మేనేజర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెప్మా ఐవీ ఎం. ఫణి, సిఎంఎం పి సుజాత సిఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

# వై.సి.పి, ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యం

**నూజివీడు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:10**



రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పత్రికా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఆర్థిక పరిస్థితికి, టీడీపీ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితికి ఉన్న వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎగ్గొట్టి, ప్రజాసమస్యలను గాలికొదిలేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి.. తాడేపల్లిలో నాలుగు గోడల మధ్య కూర్చుని సొంత పత్రిక, ఛానల్ ద్వారా ప్రభుత్వంపై బురదజిమ్ముతున్నారు. మా కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు గొప్ప నమ్మకంతో 164సీట్లు అప్పజెప్పారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లపాలనలో చేసిన రూ.9,74,000కోట్ల అప్పుల భారం కూటమి ప్రభుత్వంపై పడింది... కాగ్ నివేదికలపై వైసీపీ నాయకులు, జగన్మోహన్ రెడ్డి అసత్య ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2024-25లో రాష్ట్ర ప్రభుత్వం రూ.81,071కోట్లు అప్పు చేసింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది 2024 జూలైలో.... ఏప్రిల్, మే, జూన్ నెలలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా కూడా కూటమి పాలన జాబితాలోనే చేరింది...రూ.27,205కోట్లు 3నెలల్లో వైసీపీ ప్రభుత్వం చేస్తే......కూటమి ప్రభుత్వం 9 నెలల్లో రూ.53,866కోట్లు మాత్రమే చేసింది.రూ.16,141కోట్లను మూలధన వ్యయంపై కూటమి ప్రభుత్వం ఖర్చు పెట్టింది..రాష్ట్రానికి ఆదాయ వనరులను ఏర్పాటు చేస్తోంది..వైసీపీ ఐదేళ్ల పాలనలో బాధ్యతారాహిత్యంగా చేసిన పాలనతో రాష్ట్రం యొక్క విశ్వసనీయత పోయింది.బ్యాంకులు, పెట్టుబడిదారులు, సప్లయర్స్, కాంట్రాక్టర్లు రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకాన్ని కోల్పోయారు.ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో అప్పులు చేసిన చంద్రబాబుగారు రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేశారు. కోల్పోయిన విశ్వసనీయతను నిలబెట్టేందుకు రూ.20,000కోట్లు అప్పులను కాంట్రాక్టర్లు, ఉద్యోగులకు తీర్చారు. జగన్మోహన్ రెడ్డి సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారో మాత్రమే చెబుతున్నారు....అభివృద్ధి కోసం, ఆదాయాన్ని పెంచడం కోసం ఏం చర్యలు తీసుకున్నారు? ఉద్యోగాల కల్పన కోసం ఏం చేశారో ఎందుకు చెప్పడం లేదు? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబుగారు, కూటమి ప్రభుత్వం 25పాలసీలు తెచ్చి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షించారు.

కూటమి ప్రభుత్వాన్ని జగన్మోహన్ రెడ్డి ఒక్కవైపు మాత్రమే చూస్తున్నారు...రెండోవైపు కూడా చూడాల్సిన అవసరం ఉంది. జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి పథకం కోసం తన పాలనలో కేవలం రూ.26,067కోట్లు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం పథకం ద్వారా రూ.10,090కోట్లు ఖర్చు చేసింది...మిగిలిన 3ఏళ్లకు మరో రూ.30వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టబోతున్నాం. జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ పెన్షన్ల ద్వారా తన పాలనలో చేసిన ఖర్చు కేవలం రూ.58509.40కోట్లు. కూటమి ప్రభుత్వం 20నెలల పాలనలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రూ.58,654కోట్లు ఖర్చు చేశాం. రైతు భరోసా పథకం ద్వారా జగన్ ఐదేళ్ల పాలనలో రూ.14,430కోట్లు ఇచ్చారు...కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.6,310కోట్లు ఇచ్చాం. వైసీపీ పాలనలో ఇచ్చిన సంక్షేమం, చేసిన ఖర్చు గురించి.....కూటమి పాలనలో 20నెలల్లో ఇచ్చిన సంక్షేమం, చేసిన ఖర్చు గురించి ఈ రాష్ట్రంలో ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ.....అంకెలు, సంఖ్యలతో సహా ప్రజలకు వివరించడానికి మేం సిద్ధం. వైసీపీ ప్రభుత్వం చేతకానితనం వల్ల రాష్ట్ర ప్రజలు 5ఏళ్ల పాటు గుంతల రోడ్లతో నరకం అనుభవించారు. జగన్మోహన్ రెడ్డి లక్ష్యం లేని, ప్రణాళిక లేని, ప్రజలకు ఉపయోగకరంగా లేని విధంగా సంక్షేమ పథకాలు ఇచ్చి మోసం చేశారు. జగన్ మీ పాలనలో చదువుకున్న విద్యార్థులు డిగ్రీలు లేదా తమ కోర్సులు పూర్తిచేసి బయటకు వస్తే...వారి భవిష్యత్తు గురించి ఏనాడైనా ఆలోచించారా? యువత భవిష్యత్తును గాలికొదిలేసిన మాట వాస్తవం కాదా? పాస్ అయ్యి బయటకు వచ్చే విద్యార్థుల సంఖ్యకు, మీరు కల్పించిన ఉద్యోగాల సంఖ్యకు ఏమైనా పోలిక ఉందా? ఏనాడైనా వీటి గురించి ఆలోచించారా? మా కూటమి పాలనలో సంక్షేమ పథకాలు ఇవ్వడం మాత్రమే కాదు....రాష్ట్ర యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు పెట్టుబడులు తెచ్చి ఉద్యోగావకాశాలు కూడా సృష్టిస్తున్నాం. యువతకు నైపుణ్య శిక్షణ కూడా ఇస్తున్నాం. ఈ వ్యత్యాసాలన్నింటినీ రాష్ట్ర ప్రజలు, తల్లిదండ్రులంతా గమనించాలి. 20నెలల కూటమి పాలనలోనే ఇప్పటి వరకు దాదాపు రూ.8.50లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం...పనులు ప్రారంభించాం, కొన్ని పనులు కేంద్రం అనుమతుల కోసం పంపించాం. ఇవన్నీ నిరూపించడానికి మేం సిద్ధం. వైసీపీ అధికారంలో ఉండగా బ్యాంకుల్లో అప్పు చేయడమే కాకుండా.....కార్పొరేషన్లు, ఉద్యోగుల డబ్బులను కూడా దారిమళ్లించి ఎంత ఇబ్బందిపెట్టారో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా అయినా నిధులు ఇచ్చారా? పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేశారా? పంచాయతీల ఖాతాల్లో నిధులను జగన్ ప్రభుత్వం లాక్కోలేదా? రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులంతా గమనించాలి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు.....మా కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మంచి చేసే ప్రభుత్వంపై బురదజిమ్మడం పనిగా పెట్టుకున్నారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,38,278కోట్లు, కార్పొరేషన్ల డెబిట్‌లు రూ.2,48,000కోట్లు, అవుట్ స్టాండింగ్ డ్యూస్ రూ.1,13,000కోట్లు, ప్రభుత్వ ఉద్యోగులకు రూ.22,000కోట్లు, రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి రూ.1,600కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వారసత్వంగా వచ్చిన అప్పులుగా రూ.9,00,074కోట్లు భరించడంతో పాటు, జగన్ చేసిన అప్పులకు, వడ్డీలకు ప్రతియేటా రూ.71,881కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో అరకొర సంక్షేమ పథకాలు అమలు చేయడం తప్ప రాష్ట్రానికి ఆదాయ వనరులు ఏర్పాటు చేసే విషయాలను గాలికొదిలేశారు. ప్రధాన ప్రాజెక్టులను మూలనపడేశారు. కానీ....కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఆదాయాన్ని సృష్టించే పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలను ఒకవైపు పరుగులు పెట్టించడమే కాకుండా సంక్షేమ పథకాలు అమలు చేయడం, పెట్టుబడులు సాధించడం వంటి కీలకమైన అంశాలపై దృష్టిపెట్టి ముందుకు వెళుతోంది. వైసీపీ పాలనలో భారతీ సిమెంట్ కంపెనీ ప్రొడక్షన్ కెపాసిటీకి మించి మూడు రెట్లు అదనంగా 3.5లక్షల టన్నుల సిమెంట్ ను కొనుగోలు చేసి రూ.165కోట్ల భారాన్ని ప్రభుత్వంపై మోపింది. ఇతర పెద్ద కంపెనీలను మాత్రం నిర్లక్ష్యంగా ప్రక్కకు నెట్టింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సీనియర్ పత్రికలను ప్రక్కనపెట్టి మనస్సాక్షి లేని సాక్షి పత్రికకు రూ.400కోట్లు చెల్లించారు. రూ.200కోట్లు విలువ చేసే సాక్షి పేపర్లను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు జగన్ అంటగట్టాడు. తన ఆదాయాన్ని పెంచుకున్నాడు. కూటమి ప్రభుత్వం సంక్షేమం -- అభివృద్ధిని రెండు కళ్లలా భావించి అమలు చేస్తోంది....ఈ విషయాన్ని జగన్మోహన్ రెడ్డి గమనించాలి. కూటమి ప్రభుత్వం 20నెలల పాలనలో మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు, కానిస్టేబుల్ పోస్టులు, వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు ప్రైవేటు సంస్థల్లో కూడా ఉద్యోగాలిచ్చి యువతకు అండగా నిలబడుతుంది. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విషయాలను పూర్తిగా విస్మరించి...నేడు కూటమి ప్రభుత్వంపై బురదజిమ్మడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాలను రాష్ట్ర ప్రజలంతా గమనించాలని కోరుతున్నాను.

# రాహుల్ గాంధీ పీఎం అవడం ఖాయం

**అప్పుల్లో ఆంధ్ర రెండవ స్థానం**

**ఉపాధి హామీ పథకం బ్రతకాలి**

**ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల**





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 10**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణలో భాగంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల బహిరంగ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని బ్రతికించాలని, పేదలకు పనులు లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవడం ఖాయమని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ వేతనాలు 400 రూపాయలకు పెంచుతామని, 150 రోజులు పని దినాలు కల్పిస్తామన్నారు. మధ్యలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తో లైవ్ లో మాట్లాడుతూ త్రాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, మామిడి కుదురు మండలంలో ఫిర్యాదులు వస్తున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పార్లమెంట్ నివేదిక ప్రకారం ఆంధ్ర రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, దేశంలో అప్పులు 30 లక్షల కోట్లు అయితే, ఆంధ్ర రాష్ట్రం అప్పులు మూడు లక్షల కోట్ల 75 లక్షలు ఉన్నాయని అన్నారు, సీఎం చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడతారని రైతును అప్పుల్లో ముంచిన ప్రభుత్వం ,కూటమి ప్రభుత్వం అని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి తీసుకొచ్చిన పథకం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని, దానిని బ్రతికించేందుకు, ప్రజలను మేలుకొలుపు ఎందుకు ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి జెడి సేలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, అమలాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఒంటెద్దు బాబి, పలువురు నియోజకవర్గ, మండల కాంగ్రెస్ ఇంచార్జీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ పిఠాపురం లోగో ఆవిష్కరణ





**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 10**

గొల్లప్రోలు మండల అధికారులు ఎంపీడీవో సెలెట్ రాజు, ఎస్సై రామకృష్ణ ,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో. ఎస్సైలు పిఠాపురం నియోజకవర్గ అసోసియేషన్ అధ్యక్షుడు బాలెం నూకరాజును,ఉపాధ్యక్షుడు కసిరెడ్డి రాంబాబు, కార్యదర్శి దడాల సత్తిబాబు,కార్యవర్గ సభ్యులైన కండెల్లి శ్రీనివాస్, సూర్యం, జై లోవరాజు, శివశంకర్ కే శ్రీనివాస్,దానం ప్రకాష్, షేక్ దాదా,రవికుమార్ లను అభినందించారు.

## లింగాపాలెం మండల మాజీ పెదబాబు జన్మదిన వేడుకలు



**లింగపాలెం సిటిజన్ టైమ్స్ మార్చి 10**

లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో శ్రీ షిరిడి సాయిబాబా దర్శనం మందిరము ఆవరణం నందు టిడిపి రాష్ట్ర రైతు కార్య నిర్వహణ కార్యదర్శి గుత్తా సత్య సాయి వరప్రసాద్ (పెదబాబు) గారి జన్మదిన సందర్భంగా కేకు కట్ చేసి కూటమి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. మంచి ఆరోగ్యం దేవుడు ప్రసాదించాలని,ప్రజా సేవలో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నీటి సంఘం అధ్యక్షులు మోరంపూడి ప్రసాద్,జిల్లా టీడీపీ కార్యదర్శి చెరువుగట్టు రామ్మోహన్రావు,రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను,మండల కార్యదర్శి గజ్జా వెంకటేశ్వరరావు,సొసైటీ అధ్యక్షులు నిమ్మగడ్డ సుధాకర్,టీడీపీ యువ నాయకులు గారపాటి సాయి,బీజేపీ జిల్లా కార్యదర్శి సుబ్బారావు,జనసేన నాయకులు చల్లా నాగబాబు,మండల వాణిజ్య సెల్ అధ్యక్షులు కందుల కేశవరావు,మాకే సంగీత,సొంగ రాటాలు, రాచూరి రాజారత్నం, తనగాల యోహాను,కర్రీ వెంకటేశ్వరావు, భూపతి సాంబశివరావు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యానవన శాఖ, సర్వే సాయి కంపెనీ సంయుక్తంగా ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు



**కపిలేశ్వరపురం సిటిజన్ టైమ్స్ మార్చి 10**

తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం అద్దంకి వారి లంక గ్రామంలో ఉద్యాన శాఖ,సాయి కంపెనీ సంయుక్తంగా ఆయిల్ పామ్ రైతులకు ఇతర ఉద్యాన పంటలు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ జనరల్ మేనేజర్ కె జె ప్రభాకర్ రావు ఆయిల్ ఫామ్ పంటలో ముఖ్యంగా నల్ల కొమ్ము పురుగు ,ఎర్ర కొమ్ము పురుగు, ఎలుకల నివారణ ,సూక్ష్మ పోషకాల ముఖ్యంగా బోరాన్, మెగ్నీషియం లోపం వల్ల వచ్చే లక్షణాలు వాటి నివారణ రైతులకు వివరించడం జరిగినది.ఉద్యాన అధికారి హెచ్ఓ పి.రాజు , ఆయిల్ ఫామ్ సాగు అవశ్యకత గురించి రైతులకు వివరించడం జరిగినది వాటిలో ముఖ్యంగా వేసుకోవలసిన వివిధ రకాల అంతర పంటల గురించి రైతులకు వివరించడం జరిగినది. పామాయిల్లో ప్రభుత్వ రాయితీలు గురించి కూడా రైతులకు చెప్పడం జరిగింది. సర్వే సాయి ఏరియా మేనేజర్స్ పి.వీరభద్రరావు,బి.వెంకట కృష్ణ రాజు రైతుల ఉద్దేశించి ఆయిల్ ఫామ్ గెలలు కోత, అధిక దిగుబడి సాధించడం ఎలాగ అనేది రైతులకు చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో రైతులు, కంపెనీ సిబ్బంది ,ఉద్యాన శాఖ సిబ్బంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజల వద్దకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తీసుకువెళ్లండి

## పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

## అయినవిల్లి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి









**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ మార్చి 9**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ రథం" కార్యక్రమాన్ని అయినవిల్లి మండలంలో ప్రారంభించారు. గ్రామాల్లో గృహిణులు పొడి చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా స్వచ్ఛ రథంలో అందించాలని, దానికి బదులుగా అవసరమైన వస్తువులను పొందవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమం గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకునే రాగా ఆయా సంబంధించిన శాఖల అధికారులు స్పందించి, స్థానిక శాసనసభ్యులు వారి యొక్క సహాయ సహకారంతో మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందని కాబట్టి గ్రామాలలో సమస్యలు లేకుండా ప్రజాప్రతినిధుల యొక్క సహాయ సహకారంలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపినారు, ముఖ్యంగా సర్పంచులు వేసవికాలం సందర్భంగా త్రాగునీరు, విద్యుత్ ఎద్దడి లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపినారు. ఈ సమావేశంలో రెవిన్యూ ,వ్యవసాయ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ ,విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ,డ్రైనేజీ శాఖ, హౌసింగ్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, నీటిపారుదల శాఖ ,సంక్షేమ శాఖ ,రవాణా శాఖ, మత్స్యశాఖ ,ఎక్సైజ్ శాఖ ,పశు వైద్యశాఖ, డిఆర్డిఏ, డ్వాక్రా, మంచినీరు సరఫరా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మండలంలోని వివిధ శాఖల అధికారులు వారి సిబ్బంది పాల్గొని ఎన్డీఏ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా ప్రజలకు లబ్ధి చేగురుతుందో ,ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామాల అభివృద్ధి తదితర విషయాలనుసభకు వివరించినారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా పాల్గొని తమ గ్రామాల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అనే విషయాన్ని సమావేశాల్లో అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రతి సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 19 నెలల వ్యవధిలోనే పి. గన్నవరం నియోజకవర్గంలో సుమారు 90 శాతం రోడ్ల పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని, ధాన్యం రైతు దగ్గర నుండి కొనుగోలు చేసిన 6 గంటల నుండి 12 గంటల లోపల రైతు ఖాతాలో సొమ్ములు పడుతున్నాయని, ప్రజల యొక్క సమస్యలను గుర్తించి, రోడ్లను అభివృద్ధి చేసి ప్రతిపక్షాల నోరులను మూయించడం జరిగిందని, ప్రభుత్వం చేసేటటువంటి సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల వద్దకు తీసుకుని వెళ్లవలసిన బాధ్యత అధికారులకు ,ప్రజాప్రతినిధులకు ఉన్నదని, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండి, గ్రామాలను అభివృద్ధి చేయడానికి, గ్రామాలకు కావలసినటువంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, కాబట్టి అభివృద్ధి విషయంలో ప్రతి గ్రామానికి తన సహకారం అన్నివేళలా ఉంటుందని, ముఖ్యంగా ప్రతి ప్రజా ప్రతినిధి,అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో మంచి పేరు తీసుకుని వచ్చి సేవా భావముతో పనిచేసి నప్పుడే మంచి గుర్తింపు వస్తుందని, ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇరువురు ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపుకు తీసుకుని వచ్చారని, దీనికి సంపూర్ణ సహకారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందిస్తున్నారని, కాబట్టి పని చేసే ప్రభుత్వానికి, పనిచేసే నాయకుడుకు ప్రజల అండ ఉన్నప్పుడు మరింత అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రతినిధులకు ,నాయకులకు ఉత్సాహం కలుగుతుందని, గత ప్రభుత్వం అభివృద్ధిని మరిచి, పి. గన్నవరం నియోజవర్గాన్ని సమస్యలతో నింపి ఉంటే, నాయకులు ,ప్రజాప్రతినిధులు, పెద్దలు అధికారుల సహకారంతో నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని, అభివృద్ధి పథంలో నడిపించడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపినారు. ఏప్రిల్ రెండవ తేదీ నుండి సర్పంచుల పదవీకాలం ముగుస్తుంది. అందువలన మరల సమావేశమునకు వారికి అవకాశం ఉండనందున అయినవిల్లి మండలంలోని సర్పంచులు అందరికీ ఎంపీటీసీలు, ప్రజాప్రనిధులు ,అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శాలువ కప్పి ఘనంగా సన్మానం చేసినారు. ఈ సందర్భంగా సర్పంచులు అందరూ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీవి సరోవర్, జడ్పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు,అంబాజీపేట మార్కెటింగ్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, తాసిల్దార్ విద్యాపతి,డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీవాణి పెహర ,రాజమోహన్, సర్పంచులు,ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కార్యాలయం పరిపాలనాధికారి లక్ష్మీ, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్ సినిమాను ఆదరించాలి

## పోస్టర్ ఆవిష్కరణ చేసిన కత్తిమండ ప్రతాప్...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 10**

పైసా పైసా కూడగట్టుకుని కోటి రూపాయల బడ్జెట్ తో స్పిరిట్ చిత్రాన్ని నిర్మించిన నిర్మాతలు చెన్నుబోయిన రైతు నరసమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు అందరికి ఆదర్శం అని ప్రముఖ కవి, రచయిత, శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. స్పిరిట్ సినిమా పోస్టర్‌ను విజయవాడలో ప్రతాప్ ఆవిష్కరణ చేసారు. చిన్న రైతు కుటుంబం నుండీ నిర్మాతల స్థాయికి చేరిన చెన్నుబోయిన రైతు నరసమ్మ , వెంకటేశ్వర్లు దంపతులను గహంగా సత్కరించారు. ఈ సంధర్భంగా ప్రతాప్ విలేకరులకు వివరాలు తెలియచేసారు. తమ కలలను సాకారం చేయడానికి కోటి రూపాయల బడ్జెట్‌తో అద్భుతమైన సినిమా స్పిరిట్ ను తీసారని, రైతు కూలీ పని చేసుకుంటూ పైసా పైసా కూడగట్టి సినిమా తీయాలనే తృష్ణ తో ఈ సినిమా రూపొందించారన్నారు. పెద్ద పెద్ద నటీనటులతో సినిమా నిర్మాణం జరిగిందని, ఈ సినిమా మాతంగి దురాచారాలను, మూడనమ్మకాలను, సామాన్య జీవితం, ధైర్యం, సంకల్పం మరియు సాహసాన్ని తెరపై అద్భుతంగా చూపిస్తుంది. పెద్ద సంకల్పంతో, భారీ బడ్జెట్ సినిమా తీసేందుకు కోటి రూపాయలతో ప్రయత్నాలు పెట్టారు. ఈ నెలాఖరుకి సినిమా విడుదల కానుంది. ఈ సినిమాను ఆదరించాలని ప్రతాప్ పిలుపునిచ్చారు.

# గ్యాస్ కొరత ఎట్టి పరిస్థితుల్లో ఉండదు

## జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 10**

ఇరాన్--ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై కొన్ని అపోహలు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్నాయని వాటిలో ఎంత మాత్రం వాస్తవం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి మంగళవారం ప్రకటనలో స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ కొరత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదన్నారు.గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.కోనసీమ జిల్లాకు ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం నేప థ్యంలో గ్యాస్ సరఫరాలో ఏ విధమైన కొరత లేదని యధావిధిగా సరఫరా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. గ్యాస్ కొరత వస్తుందని ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం 21 రోజులు గడువు లో మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగ దారులకు సూచించారు. ఆసుపత్రి అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరా లో నిలుపుదల ఉండదని ఆమె స్పష్టం చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం, అంగ న్వాడి కేంద్రాలు సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ నిలుపుదల చేసినట్లు ప్రసార మాధ్యమాలలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవ మని ఆమె వెల్లడించారు. మంగళవా రం (నేడు) గ్యాస్ బుకింగ్ పోర్టల్ సాంకేతిక సమస్య లు ఉత్పన్నం కాబడి బు కింగ్లునిలిచిపోయాయని తదుపరి యధావిధిగా పని చేస్తోందన్నారు.అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొను గోలు చేయడం చేయరాదన్నారు. ప్రభు త్వం మరియు జిల్లా పరిపాలన పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నా యన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు.

# నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ ప్రభాత్ తివారీతో సమావేశమైన ఎంపీ.



**విజయవాడ/ న్యూఢిల్లీ ( సిటిజన్ టైమ్స్ ): మార్చి:10:**

నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ ప్రభాత్ తివారీతో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) న్యూఢిల్లీలో మంగళవారం సమావేశమయ్యారు. ప్రభాత్ తివారీ ను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ హైదరాబాద్‌లో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డి) ద్వారా చేపడుతున్న సేవా, మహిళలకు నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక చేయూత నిచ్చే శిక్షణా కార్యక్రమాలను వివరించారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని పేద మహిళలకు స్వయం ఉపాధి చూపేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను ఎన్ఐఆర్‌డీ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. శిక్షణ పొందుతున్న వారిలో అనేక మంది ఎస్సీ (షెడ్యూల్డ్ క్యాస్ట్స్) మహిళలు ఉన్నారని సీఎండీ తివారీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ఐఆర్‌డీ ద్వారా శిక్షణ తీసుకునే పేద ఎస్సీ మహిళలకు చేయూతనిచ్చేలా నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మార్కెటింగ్, ఫైనాన్స్ సహకారం కల్పించాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఎస్సీ మహిళలకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాముల నిర్వహణ, శిక్షణ తరువాత ఉపాధి నిమిత్తం ఆర్థిక చేయూత ఇచ్చేలా , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సహకారం అందించాలని కోరారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఐఆర్ డి ద్వారా శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన జాతీయ ఎస్సీ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిఎండి ప్రభాత్ తివారి త్వరలోనే విజయవాడకు ఒక బృందాన్ని పంపించి ఏపీ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు, స్త్రీ నిధి విభాగం సమన్వయంతో పరిశీలన చేయిస్తామని, బృందం నివేదిక అందగానే ఎన్ఐఆర్ డి చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ కు తెలిపారు. ఈ మేరకు త్వరలోనే ఢిల్లీ నుంచి బృందం ను విజయవాడ పంపుతామన్నారు.

# ఎంపీ ప్రశ్నకు కేంద్రం సమాధానం

**సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం హెక్టారుకు రూ. 31,500.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కేంద్ర వ్యవసాయ మంత్రి.**

**సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహించేందుకు రెండు ప్రత్యేక పథకాలు అమలు చేస్తోన్న కేంద్రం.**


**హెక్టారుకు రూ. 31,500 ఆర్థిక సాయం, మార్కెటింగ్, ధరల స్థిరీకరణకు చర్యలు.**

**సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఏపీ ప్రభుత్వం విధానాలు భేష్**

**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రశ్నకు కేంద్రం సమాధానం.**

**ఏలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో "పరంపరగత్ కృషి వికాస్ యోజన ద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి తీసుకుంటున్న చర్యలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. పి కె వి వై పథకం కింద, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి 3 సంవత్సరాలలో హెక్టారుకు రూ. 31,500 సహాయం అందిస్తున్నామన్న కేంద్ర మంత్రి, ఇందులో రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా వ్యవసాయం/ఆఫ్-ఫామ్ సేంద్రీయ ఇన్‌పుట్‌ల కోసం హెక్టారుకు రూ. 15,000, మార్కెటింగ్ మరియు బ్రాండింగ్ కోసం హెక్టారుకు రూ.4,500, సర్టిఫికేషన్ కోసం హెక్టారుకు రూ.3,000 మరియు శిక్షణ మరియు సామర్థ్య నిర్మాణానికి హెక్టారుకు రూ.9,000 సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా పీకేవీ వైపథకంతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేకంగా "మిషన్ ఆర్గానిక్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ పథకం కింద రైతులకు ఉత్పత్తి నుండి ప్రాసెసింగ్, సర్టిఫికేషన్ మరియు మార్కెటింగ్ వరకు ఎండ్-టు-ఎండ్ మద్దతుపై దృష్టి పెడతున్నట్లు చెప్పారు.



**ఆంధ్రప్రదేశ్ విధానాలపై ప్రశంస..**

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. సేంద్రీయ వ్యవసాయం, సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మేలైన విధానాలను అవలంబిస్తున్నట్లు కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయబడ్డ 1,089 రైతు బజార్లలో సేంద్రీయ ఉత్పత్తుల అమ్మకాలకు అవకాశం కల్పిస్తున్నారని, ఇవి మధ్యవర్తులను తగ్గించి, రైతులకు ప్రత్యక్ష మార్కెటింగ్ మార్గాలను బలోపేతం చేస్తున్నాయన్నారు. సేంద్రీయ ఉత్పత్తులు నిల్వ చేసే సమయంలో నష్టాలను తగ్గించడానికి రాష్ట్రం ప్రాసెసింగ్, గ్రేడింగ్, ప్యాకేజింగ్ విషయాల్లో రైతులకు సహకారం అందించడంతోపాటు, రైతులు, బల్క్ కొనుగోలుదారులు, రిటైలర్లు మరియు సంస్థాగత వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధాలను సులభతరం చేయడానికి రాష్ట్రం కొనుగోలుదారు-అమ్మకందారుల సమావేశాలను నిర్వహిస్తోన్న విషయాన్ని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వయం సహాయక బృందాలు ద్వారా ఇప్పటికే 59 గ్రామాలలో గృహ అవసరాల కోసం సహజ వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే విధంగా ఫుడ్ బాస్కెట్ నమూనాను అమలు చేయటం జరిగిందని, దీనిని మరో 340 గ్రామాలకు విస్తరిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపిందన్నారు. అంతేకాకుండా, రైతు అగ్రిగేటర్లు, సహజ వ్యవసాయం చేసే రైతులతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సేంద్రీయ మేళాలు, ప్రదర్శనలు మరియు సమావేశాలు నిర్వహిస్తూ ఏపీ ప్రభుత్వం రైతులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు.

## రాజోలు నీటి సంఘం చైర్మన్‌గా ఆకన బాబ్జి నాయుడు...



**రాజోలు సిటిజన్ టైమ్స్, మార్చి 10:**

కోనసీమ జిల్లా, రాజోల్లో నీటి సంఘం అధ్యక్షునిగా, నీటి సంఘం చైర్మన్ గా ఆకన బాబ్జి నాయుడు బాధ్యతలు తీసుకుని, కొన్ని అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సెంట్రల్ డివిజన్ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే వెంకటేశ్వరరావు, పి గన్నవరం సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రవీంద్రబాబు, రాజోలు ఇరిగేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి రమేష్ బాబు,లు నీటిసంఘ సభ్యుల చే కొన్ని తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సబ్యులు, చైర్మన్ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీ కలిసిన వేగుళ్ళ లీలా కృష్ణ....



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చ్ 10**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జి. సాయి ప్రసాద్ ని మంగళవారం రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జి. సాయి ప్రసాద్ కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా నీటిపారుదల రంగం పురోగతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రంలో సాగునీటి వనరుల అభివృద్ధి, రైతులకు మెరుగైన నీటి సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారితో చర్చించారు.

## 13 వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షకు 45 మంది గైర్హాజరు

**గిద్దలూరు, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 13 వరోజు మంగళవారం నాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. భౌతిక శాస్త్రం -1 తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు ఫిజికల్ సైనెన్స్ -1 ఈ రోజు నిర్వహించబడ్డాయి. కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 678 మంది హాజరవ్వాల్సి ఉండగా 633 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 231 మందికి 217 మంది హాజరు కాగా 14మంది గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 259 మందికి 244 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు.

# ఆధిపత్య పోరు కోసమే యుద్ధాలు

**చిన్న దేశాల పై పెద్ద దేశాల దాడి**

**యుద్ధాలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులకు విఘాతం, పర్యావరణానికి పెను ముప్పు**

**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

ఆధిపత్య పోరు కె అగ్ర రాజ్యాలు పోటీ పడుతున్నాయని చిన్న రాజ్యాల పై దాడులు చేసి వారి సంపద ను కొల్ల గొట్టే ప్రయత్నం లో భాగం గా నే నేడు యుద్ధాలు జరుగుతున్నాయని ఈ యుద్ధాలు ఆపి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ఐక్య రాజ్య సమితి కీలక పాత్ర పోషించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి రవీంద్ర నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం లో ప్రపంచ శాంతి అనే అంశంపై చర్చా గోష్ఠి ని విశ్రాంత సర్వేయర్ రెడ్డి మల్ల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆధిపత్యం కోసమే అగ్ర రాజ్యాలు చిన్న రాజ్యాల పై దాడి చేసి అక్కడి సంపద ను దోచుకోవాలనే ప్రయత్నం లో భాగంగా నే యుద్ధాలు చేస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ శాంతి అనేది కేవలం యుద్ధాలు లేదా హింస లేకపోవడం మాత్రమే కాదని దేశాల మధ్య ప్రజల మధ్య సహకారం ,సోదర భావం ,పరస్పర గౌరవం కలిగిన ఆదర్శవంతమైన స్థితి ,మానవాళి మనుగడ కు ప్రపంచ ప్రగతి కి పునాది వంటిది అన్నారు.శాంతి యుత వాతావరణం లో నే ప్రజలందరికీ సమాన హక్కులు,స్వేచ్ఛ న్యాయం అందుతాయన్నారు.యుద్ధాల వల్ల వనరులు విధ్వంసం కు గురి అవుతాయని అణ్వాయుధాలు, యుద్ధ తంత్రాలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని కాకుండా ఆర్థికాభివృద్ధి పై పెను మార్పులు సంభవించి ప్రజల పై కూడా పెను భారం మోపవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఐక్య రాజ్య సమితి వంటి సంస్థ ల ద్వారా దేశాల మధ్య వివాదాల ను దౌత్య పరంగా పరిష్కరించుకోవాలన్నారు.ప్రపంచ శాంతి అనేది ఒక్కరి తో సాధ్యం అయ్యేది కాదనీ ఇది ప్రతి ఒక్కరి భాద్యత అని మతాలు, జాతులు,సరిహద్దు ల కు అతీతంగా వసుధైక కుటుంబ శీ అనే భావం తో వెలిగితేనే రాబోయే తరాలకు శాంతి యుత ప్రపంచాన్ని అందివ్వగలమన్నారు. ప్రపంచ శాంతి కి పునాది వ్యక్తిగత శాంతి అని వ్యక్తులు తమ లో తాము శాంతి ని అనుభవించినప్పుడే మార్పులు వస్తాయన్నారు.నేటి యుద్ధాలు ఆధిపత్య పోరు తో నే జరుగుతున్నాయని



వీటి వల్ల ఆస్తి నష్టం ,ప్రాణ నష్టం, సహజ సంపద నశించిపోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ రణ రంగం వల్ల న రవాణా సౌకర్యం స్తంభించి ,గ్యాస్ ,పెట్రోల్, డీజిల్, ఆహార పదార్థాల ధరలు పెరిగి ప్రజల పై పెను భారం పడుతుందన్నారు.అగ్ర రాజ్యాలు తాము చేసిన యుద్ధ సామాగ్రి ని ఆయుధాల ను విక్రయించేందుకు రాజ్యాల మధ్య వైషమ్యాలు పెంచి యుద్ధ వాతావరణం సృష్టించి తమ యుద్ధ ఆయుధాల ను విక్రయించుకుంటున్నారు అని పేర్కొన్నారు. రెడ్డి మల్ల రెడ్డి మాట్లాడుతూ ఈ యుద్ధం లో ఎంతో ఆస్తి నష్టం కలిగి ఎందరో చిన్నారులు తమ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నేడు జరుగుతున్న యుద్ధం అంతర్జాతీయ న్యాయ సూత్రాల కు విరుద్ధమని ఐక్య రాజ్య సమితి దీని స్పందించకపోవడం శోచనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆది నారాయణ ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బి ఎస్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొని ప్రపంచ శాంతి కోసం తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# మత్స్య సంపద పెంపుకు పరిశోధనా కేంద్ర్రాల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

**ఒంగోలు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

దేశంలో , ఆంధ్రప్రదేశ్ లో చేపల పెంపుదలకు అదనపు పరిశోధనా సంస్థలు మరియు ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటు,పథకాలు, నిధులు మరియు ప్రభుత్వ -- ప్రైవేటు భాగస్వామ్యం గురించి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖామంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానమిస్తూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ( ఐసిఏఆర్) నివేదిక ప్రకారం, దేశంలో ప్రత్యేక కార్యాచరణ గల 30 ప్రాంతీయ స్టేషన్లతో 8 మత్స్య పరిశోధనా కేంద్రాలు పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడలో 1 , విశాఖపట్నంలో 2, విజయవాడ లో 1 ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. చేపల ఉత్పత్తి పెంపుదల, సుస్థిర



నీటి వినియోగం, నీటి సంరక్షణ, పర్యావరణ, నిర్వహణ తదితర అంశాలతోపాటు ఈ కేంద్రాలలో మత్స్య సైన్సు బోధన, పరిశోధన, సాంకేతికతల అభివృద్ధిపై పనిచేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విత్తన, చేపల ఉత్పత్తి, పెంపకం నియంత్రణ, ఉత్పత్తి సంబందిత తదితర విషయాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక చట్టాలు రూపొందించి మత్స్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటుచేసి, గత 3 సం.లలో 40,000 కష్టమర్లకు సాంకేతిక మద్దతు, శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాణ్యమైన చేపల పెంపుదలతోపాటు అభివృద్ధి చెందిన చేపల జాతులు, ఆరోగ్యం, సంరక్షణ, వ్యాధుల నిర్ధారణ, పరిశోధనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మత్స్య శాఖ వారు రాష్ట్ర విశ్వవిద్యాలయం, ప్రైవేటు రంగ సంస్థల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలను అమలుచేయుచున్నదని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## దద్దాలను సన్మానించిన ముల్లంగి శ్రీహరి రెడ్డి



**పామూరు, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

పుట్టినరోజు వేడుకలలో భాగంగా కొత్తూరు విచ్చేసిన సందర్భంగా కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మరియు పార్టీ శ్రేణులను తన నివాసానికి ఆహ్వానించి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించిన కనిగిరి మండలం రైతు విభాగం అధ్యక్షులు ముల్లంగి శ్రీహరి రెడ్డి. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరి రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, తమ్మినేని సుజాత, సిరుప గోవర్ధన్ రెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, పోలక సిద్ధారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మల్లెల యాకోబు, మూలే మాలకొండ రెడ్డి,భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, సంగటి మహేందర్ రెడ్డి, పైడాల మోహన్ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

గిద్దలూరు మండలం దిగువమెట్టలో మంగళవారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కారు టైర్ ఒక్కసారిగా పంచర్ కావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా కాసేపు కలకలం రేగింది.

## గ్రామానికి తారురోడ్డు మంజూరు ఎమ్మెల్యే

**గ్రామ ప్రజల ఘన సన్మానం**



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

కంబం మండలం ఎర్రబాలెం గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి 1 కోటి 50 లక్షల రూపాయల తో కొత్త తారురోడ్డు మంజూరు చేయించి పనులను పూర్తి చేయించారు రోడ్డు నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి శాలువా కప్పి, పూలమాల తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుం టామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. మంచి ప్రభుత్వానికి, అభివృద్ధి కి పాటుపడేవారి అండగాఉండాలని కోరారు.

## చిమట అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాలు

**పొదిలి, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

మర్రిపూడి మండలం లోని చిమట గ్రామ అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాలు జరిగాయి. పరిశుభ్రత వారోత్సవాల సందర్భంగా ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు పరిశు భ్రత వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో పరిశుభ్రతతో పాటు బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే పరిశుభ్రత పట్ల పాటించాల్సిన పద్ధతులను ప్రదర్శించడంతోపాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల నాయకులు కే స్వాతి, రాధ జ్యోతి, లక్ష్మీ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### ఎంఈఓ రాజాల కొండారెడ్డి



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు పరీక్షల సమయంలో విద్యార్థులు కింద కూర్చొని రాసేలా ఉండరాదని సూచించారు విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైన బల్లలు ఫర్నిచర్ పరీక్షా కేంద్రాలకు సమకూర్చారని అన్నారు అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు మెనూ ప్రకారం మాత్రమే విద్యార్థులకు అందించాలని కుకింగ్ ఏజెన్సీలకు దూషించారు పరీక్షా కేంద్రాల పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాద రున్నీసాబేగం, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు.

# విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేసిన సేవ స్వచ్ఛంద సంస్థ




**మార్కాపురం (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

10వ తరగతి పరీక్షల నేపథ్యంలో 120 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ని స్వచ్ఛందంగా సేవా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కందుల అనిల్ కుమార్ పంపిణీ చేశారు. తర్లుపాడు మండలం మీర్జపేట, నాగేళ్ళాముడుపు, తాడివారిపల్లిలలోని ఎస్సీ బీసీ హాస్టల్ లోని సుమారు 120 మంది పదవ తరగతి విద్యార్థుల కు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్స్, అరైజర్,చెప్నర్లు , స్కెల్స్, హాల్ టికెట్ పౌచ్లు, మొదలగు పరీక్ష సమగ్రి ని సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంటల్ విలేజ్ ఆక్టివిటీస్ సేవా స్వచ్ఛంద సేవ సంస్థ వారు ఉచితంగా పంపిణి చేసారు. విద్యార్థులు అందరూ ఒత్తిడి కి గురి కాకుండా, ప్రశాంతగా పరీక్షలు రాసి అందరూ వంద శాతం ఉతీర్ణత సాధించాలని సంస్థ డైరెక్టర్ కందుల అనిల్ కుమార్ ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థునులు సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు కిరణ్ కుమార్, శ్యాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసతిగృహాల వార్డెన్లు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పొదిలి, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పొదిలి-ఒంగోలు రహదారిలోని అగ్రహారం గ్రామ సమీపంలో జరిగింది. మండలంలోని గోగినేని వారి పాలెం గ్రామానికి చెందిన రత్తయ్య అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై వెళుతుండగా. అటువైపుగా వస్తున్న ఒక టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్తయ్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత టిప్పర్ డ్రైవర్ ఆపకుండా, టిప్పర్ తో సహా పరాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై పొదిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎన్ఫోర్స్మెంట్ డిటిగా విజయభాస్కర్ నియామకం

**కందుకూరు, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

కందుకూరు నియోజక వర్గం ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాహశీల్దార్ గా ఎస్. విజయభాస్కర్ నియమించబడ్డారు. ఈయన నియోజకవర్గంలోని పలు తహసిల్దార్ కార్యాలయాల్లో గతంలో వివిధ హోదాల్లో పనిచేసి, సముచిత సేవలందించారు.



# ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తో భేటీ అయిన మార్కాపురం జిల్లా ప్రధాన హౌసింగ్ అధికారి

**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

మార్కాపురం జిల్లా గృహనిర్మాణ శాఖ నూతన జిల్లా అధికారి యం. వి.మోహన్ రావు , గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభ్యులు నియోజకవర్గ పురోగతిపై , ఆవాస్ ప్లస్ గ్రామీణ పథకం నూతన మంజూరులపై చర్చించారు. అనంతరం మార్కాపురం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ , అందె పవన్ కుమార్, ఉపకార్యనిర్వహక ఇంజనీర్ షేక్ ఖదీర్ బాషాలతో కలిసి గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల సహాయక ఇంజనీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సమీక్షలో ఉగాది నాటికి పూర్తి చేయవలసిన లక్ష్యాలపై , గ్రామీణ పథకం నూతన మంజూరులపై సిబ్బందితో సమీక్షించి, ఉగాది నాటికి లక్ష్యాలను చేదించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉగాది రోజు నిర్వహించబోయే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధముగా ఉండాలని సూచించారు. సమీక్ష అనంతరం గిద్దలూరు నగరపంచాయితీ కమీషనర్ తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని కొండపేట పి.యం. ఏ.వై - ఎన్టీఆర్ నగర్ కాలనీ, నల్లబండ బజార్ పి.యం. ఏ.వై - ఎన్టీఆర్ నగర్ కాలనీలను సందర్శించారు.





సందర్శన సమయములో సదరు లేఅవుట్లు నందు పెరిగిన చిల్లచెట్లను, నీటి సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకువెల్లగా, సదరు లేవుట్లలో వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేయించి, నీటి సమస్యపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్శనలో గిద్దలూరు సహాయక ఇంజనీర్ యం. మహేశ్వర రెడ్డి, గృహనిర్మాణ శాఖ సిబ్బంది, వార్డు అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అల్లినగరం గ్రామపంచాయతీ వైసిపి సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా కానగారి రామయ్య.

### సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా నియమించిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపిన రామయ్య.

**కొమరోలు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామపంచాయతీ వైసీపీ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కానగారి రామయ్యను వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నియమిస్తూ వైసీపీ జిల్లా కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లినగరం పంచాయతీలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కానగారి రామయ్య వైసీపీ పార్టీలో చురుకుగా పనిచేస్తూ ,పార్టీ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ నేతల తో గుర్తింపు పొందారు .దీనితో రామయ్యను అల్లినగరం గ్రామపంచాయతీ వైసిపి సోషల్ మీడియా వింగ్ అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు .తన సేవలను గుర్తించి తనకు అల్లినగరం గ్రామపంచాయతీకి వైసిపి వింగ్ అధ్యక్షులుగా నియమించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్రస్థాయి వైసీపీ నేతలకు, తన పేరును సిఫారసు చేసిన గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డికి ,కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకటనాయుడుకు ,మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరికి, అల్లినగరం గ్రామపంచాయతీ వైసీపీ నాయకులు ,గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, అల్లినగరం గ్రామ సర్పంచ్ బంగారు రత్నాలు, ఎంపిటిసి సభ్యులు జాజం వెంకటరమణ ,మాజీ ఎంపిటిసి సభ్యులు బంగారు నారాయణమ్మ ,గోల్కొండ చాంద్ బాషా, అబ్దుల్ సుభాన్, గోల్కొండ బ్రదర్స్ ,తదితర నేతలకు రామయ్య ధన్యవాదాలు తెలిపారు,.పార్టీ తనపై గల నమ్మకంతో తనకు కల్పించిన పదవికి వన్నె చేస్తూ పార్టీ అభివృద్ధికి నిజాయితీతో కృషి చేస్తూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రామయ్య పెన్ పవర్ ప్రతినిధికి తెలిపారు.



# కుల బహిష్కరణకు దారి తీసే చర్యలకు పరిష్కారం

### ఎమ్మార్వో చిరంజీవి



**మార్కాపురం (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

మార్కాపురం మండలం మిట్టమీది పల్లె లో నివసిస్తున్న ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారు వారి కులవృత్తి అయిన పందులు, ఇతరత్రా కార్యక్రమాలను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి జీవనవృత్తికి ఆటంకం కలిగిస్తూ గ్రామములో ఉన్న ఇతర ఆధిపత్య పెద్దలు తమ గ్రామంలోనికి గాని నిత్యవసరాల కొనుగోలుకు కానీ గ్రామంలోని వారు వారికి ఎవరు సహకరించకూడదని సహకరించినట్లయితే జరిమానా విధించబడుతుందని గ్రామంలోని గుడిలో ప్రకటన చేశారని, సోమవారం గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదు మేరకు.. తాసిల్దార్ చిరంజీవి మరియు సిఐ సుబ్బారావు, గ్రామీణ ఎస్సై వేమనలు గ్రామానికి వెళ్లి ఇరు కుల పెద్దలతో మాట్లాడి, హెచ్చరికలు చేసి, సమస్యను పరిష్కరించడం జరిగిందని ఎమ్మార్వో తెలేపారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి -ఏపీవో సుబ్బారావు



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఉన్న అనంతరాములు కుంట వద్ద జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఏపీవో సుబ్బారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతి, నాణ్యత, కూలీల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఇంకా ఎక్కువ మందికి పనులు కల్పించేలా కూలీల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కూలీలకు పనులు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కూలీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే వారికి పూర్తి స్థాయిలో దినసరి కూలీ లభిస్తుందని తెలిపారు. కూలీలు సమయానికి పనులకు హాజరై విధిగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో కూలీలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉదయం తొందరగా వచ్చి పనులు చేయాలని ఆయన సూచించారు. అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడం, తగినంత తాగునీరు తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని అన్నారు గ్రామాల్లో చెరువులు కుంటలు శుభ్రపరిచే పనులు మట్టి పనులు చేపట్టడం ద్వారా పశు పోషకులకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు తనిఖీ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అద్దంకి పురపాలక ప్రత్యేకాధికారిగా జాన్సన్

**అద్దంకి (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

అద్దంకి పురపాలక సంఘం పాలకవర్గం పదవీకాలం ముగియడంతో పరిపాలనా వ్యవహారాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రత్యేకాధికారిని నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పాలకవర్గాల గడువు ముగిసిన పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అద్దంకి పురపాలక సంఘం ప్రత్యేకాధికారిగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్సన్‌కు బాధ్యతలు అప్పగించింది. నూతన పాలకవర్గం ఎన్నికయ్యే వరకు పురపాలక సంఘంలో పరిపాలనా వ్యవహారాలు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను ప్రత్యేకాధికారి హోదాలో ఆయన పర్యవేక్షించనున్నారు.



# కందుల శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**పొన్నలూరు (సిటిజన్ టైమ్స్) మార్చి 10**

మండలంలోని చెన్నుపాడు బోగనంపాడు గ్రామాలలో శనగ కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా మండలంలోని గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కొండపి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ తెలిపారు. మంగళవారం చెన్నుపాడు, భోగనంపాడు లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏవో వి రాము మాట్లాడుతూ కందులు క్వింటాకు 8 వేల రూపాయలు, సెనగలు క్వింటాకు రు 5875 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్రగుంట శ్రీనివాసరావు, పొన్నలూరు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఉన్నం కొండలరావు, ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్పర్సన్ మన్నెం రమణయ్య, సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పిల్లి వెంకట నారాయణరెడ్డి, పల్లపోతు రమేష్ బాబు, తానికొండ మహేంద్ర, అనుమోలు సుధాకర్, మన్నెం మల్లికార్జునరావు, చిడిపోతు శ్రీకాంత్, పిఎసిఎస్ మెంబర్స్ లింగంగుంట బ్రహ్మ పేరయ్య, భూమిరెడ్డి ఎరుకుల రెడ్డి, పల్లపోతు వెంకట్రావు, రమణయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# చైతూ ఇప్పటికి మెయిన్ గేమ్‌లోకి వచ్చాడా?



ఆషికా రంగనాథ్ రీగల్ పర్పుల్ లెహంగా మ్యాజిక్




టాలీవుడ్‌లో హీరోలకు కొదవలేదు. ఇతర ఇండస్ట్రీలతో పోలిస్తే మన దగ్గర హీరోలు చాలా మందే ఉన్నారు. ఇందులో స్టార్స్ కుటుంబాల వారసులు కూడా ఎక్కువే. అయితే చాలా వరకు స్టార్స్ ఫ్యామిలీ వారసుల్లో కొంత మంది ఇప్పటి వరకు వారికున్న యాక్టింగ్ ప్రొటెన్షియాలిటీకి తగ్గ సక్సెస్‌లని, ఆ స్థాయి కథలని..క్యారెక్టర్లని ఇంత వరకు చేయలేకపోతున్నావారు ఇద్దరు ముగ్గరున్నారు. వారిలో ముందు వరుసలో నిలుస్తున్నహీరో అక్కినేని నాగచైతన్య. అక్కినేని నాగార్జున వారసుడిగా అరంగేట్రం చేసినా ఇంత వరకు తన సత్తాకు తగ్గ క్యారెక్టర్, సినిమా చేయలేకపోతున్నాడు. అలాంటి కథల్ని ఎంచుకుని రేస్‌లో ముందుకు రాలేకపోతున్నాడు అనే భావన అక్కినేని అభిమానుల్లో గత కొంత కాలంగా వినిపిస్తూనే ఉంది. చైతూ ఫస్ట్ మూవీ -జోష్-. ఇందులో తను ప్రదర్శించిన నటన, చూపించిన హావభావాలు, ప్రదర్శించిన యాటిట్యూడ్ మరే సినిమాలో చూపించలేదు. ఫస్ట్ మూవీలోనే అనుభవం ఉన్న ఆర్టిస్ట్‌లా అన్ని వేరియేషన్స్ చూపించిన నాగచైతన్యలో మంచి నటుడు ఉన్నాడని ఫస్ట్ మూవీతో అందరికి అర్థమైంది. కానీ తనకు తగ్గ కథలని ఇప్పటి వరకు చేయలేదు నాగాచైతన్య. నటుడిగా, హీరోగా అతనికున్న ప్రొటెన్షియలిటీకి తగ్గ సినిమా చేస్తే చూడాలని గత కొన్నేళ్లుగా అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అది ఇప్పటికి నెరవేరబోతున్నట్టుగా తెలుస్తోంది. నాగచైతన్య నటిస్తున్న తాజా మూవీ -వృశకర్మ-. చైతూ నటిస్తున్న 24వ సినిమా ఇది. మీనాక్షీ చౌదరి కథానియికగా నటిస్తోంది. ఇదొక మిస్టికల్ యాక్షన్ థ్రిల్లర్. -విరూపాక్ష- ఫేమ్ కార్తిక్ దండు దర్శకుడు. ట్రెజర్ హంటర్‌గా నాగచైతన్య నటిస్తున్నాడు. ఈ మూవీ బడ్జెట్ రూ.120 కోట్లు. చైతూ కెరీర్‌లో ఈ స్థాయి భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఫస్ట్ మూవీ ఇది. తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. గత చిత్రాలకు భిన్నంగా చైతూ ఇందులో కనిపిస్తున్నాడు. కంటెంట్, క్యారెక్టర్ చాలా ఇంటెన్సిటీతో పవర్ ఫుల్‌గా సాగుతుదని తెలుస్తోంది. గ్లింప్స్ చూసిన తరువాత అక్కినేని అభిమానులు ఇది కదా నాగచైతన్య నుంచి ఇన్నాళ్లుగా కోరుకుంటోందని హ్యాపీ ఫీలవుతున్నారు. చైతూ మాత్రం అంతకు మించి చెబుతున్నాడు. తన కెరీర్‌ని మలుపు తిప్పే సినిమా ఇదని బాహాటంగానే చెబుతున్నాడు. ఈ మూవ్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నా.. నా కెరీర్‌లోనే ఇదొక బెస్ట్ మూవీ అవుతుందని గట్ ఫీలింగ్‌తో చెబుతుండగం గమనార్హం.గతంలో దేవ కట్టతో చేసిన -ఆటోనగర్ సూర్య- సినిమాతో నాగచైతన్య స్టార్ లీగ్‌లోకి ఎంటరవుతాడని అంతా భావించారు. దానికి సంబంధించిన డైలాగ్ టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేయడంతో అభిమానులు కూడా ఖుషీ అయ్యారు. కంటెంట్ మిస్‌ఫైర్ కావడం, రిలీజ్ డిలే కావడంతో ఆశించిన స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేకపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు -వృశకర్మ-తో అక్కినేని అభిమానులు ఎదురుచూస్తున్న కమర్షియల్ బ్లాక్ బస్టర్ చైతూకు రాబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చైతూ కూడా చాలా స్ట్రాంగ్‌గా చెబుతున్నాడు. ఈ సారి ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న కమర్షియల్ సక్సెస్ కొట్టేస్తామని..అంతా ఆశిస్తున్నట్టే -వృశకర్మ- బ్లాక్‌బస్టర్ హిట్ అయితే చైతూ కెరీర్ మరో మలుపు తిరగడం ఖాయం.



రియా చక్రవర్తి సొగసైన రెడ్ శారీ లుక్‌లో స్టన్స్

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ



టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్షదీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్షదీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్షదీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్షదీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్షదీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్షదీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా

లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్షదీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?



భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్ధలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

# రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్



టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. “ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా” అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు.ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. “మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది” అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. “2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది” అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. “మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది” అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.

ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. “2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం” అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... “ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం” అని సూర్య తెలిపాడు.వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776